క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ, గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర పూజా కార్యక్రమాలు జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

50 శాతం పశుగణన పూర్తి



పశుగణన చేస్తున్న డాక్టర్ కృష్ణానాయక్

మద్దికెర : మండలంలోని గ్రామాల్లో మొత్తం 8,340 ఇళ్లు ఉండగా ఇప్పటి వరకు 3,950 ఇళ్లను సర్వే చేశామని, మొత్తం 50 శాతం పశుగణన పూర్తయిందని పశువైద్యాధికారి కృష్ణానాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో అఖిల భారత పశుగణన సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పాడిరైతులు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.

సొంత నిధులతో సీసీ రోడ్డు, కుళాయిలు



అమకతాడులో ఏర్పాటు చేసిన సీసీ రహదారి

కృష్ణగిరి: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని వారు ఎదురుచూడలేదు. ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా రహదారి నిర్మించలేదు. దీంతో ఒకరిపై ఆధారపడకుండా కాలనీలో ఉన్న దాదాపుగా పది ఓసీ కుటుంబాలు సొంత నిధులతో రహదారి నిర్మించుకోవాలని తలచారు. దీంతో నిధులు పోగు చేసుకుని దాదాపుగా 30 మీటర్ల మేర సీసీ రోడ్డు, ఇంటింటికీ కుళాయిని ఏర్పాటు చేసుకున్నట్లు కాలనీవాసులు తులసీరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు శుక్రవారం తెలిపారు. దీని కోసం సుమారు రూ.80 వేల వరకు ఖర్చయ్యిందని చెప్పారు.

ప్రశాంత ఎన్నికలకు కృషి

హాలహర్వి: మండలంలో శనివారం జరిగే నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ నజ్మాబాను అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయాశాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. అధికారులు ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకునే వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు.

ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలి

మద్దికెర : ప్రజాస్వామ్యబద్ధంగా సాగునీటి సంఘాల ఎన్నికలు నర్వహించకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు భద్రయ్య శుక్రవారం అన్నారు. మదనంతపురం మైనర్ ఇరిగేషన్‌కు శనివారం నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. 690 ఎకరాలకు ఇరిగేషన్ ఉందని, 254 ఓట్లుకు 6 టీసీలు ఉన్నాయని చెప్పారు.

చేపల పెంపకానికి మరోసారి వేలం

తుగ్గలి : మండలంలోని జొన్నగిరి చెరువులో చేపల పెంపకానికి మరోసారి అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. సెప్టెంబర్ 20న నిర్వహించిన వేలం పాటలో అదే గ్రామానికి ఓ వ్యక్తి రూ.15లక్షలకు దక్కించుకోగా సకాలంలో పంచాయతీకి డబ్బులు చెల్లించలేకపోయారు. దీంతో శుక్రవారం ఈవోపీఆర్డీ శ్రీహరి ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం వద్ద మరోమారు వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో గ్రామానికి చెందిన మీసాల శేఖర్ రూ.5లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, వీఆర్వో కాశీరంగస్వామి పాల్గొన్నారు.

మూడున్నర కిలోల కణితి తొలగింపు

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఓ మహిళకు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. జూటూరుకు చెందిన ఓ మహిళ కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతోంది. నొప్పి తీవ్రం కావడంతో శుక్రవారం భర్త ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కడుపులో కణితి ఉందని చెప్పారు. వైద్యులు చికిత్స చేసి అండాశయంలో ఉన్న మూడున్నర కిలోల కణితిని తొలగించారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచితంగా ఆపరేషన్ చేసినట్లు ఆస్పత్రి ఎండీ నీలకంఠ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఆస్పరి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఇసుక ట్రాక్టర్లు

ఆస్పరి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆస్పరి సీఐ మస్తాన్‌వలి శుక్రవారం తెలిపారు. మండలంలోని వెంగళాయిదొడ్డి ఆయకట్టు చెరువు నుంచి ఆదోనికి నాలుగు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా దాడి చేసి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. చెరువులు, వంకల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

మూలకు చేరింది..



విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సొంతంగా బుకింగ్ చేసుకునేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కియోస్కలను ఏర్పాటు చేసింది. ఇలా ప్రతి కేంద్రంలో రూ.1.50 లక్షల చొప్పున వెచ్చించి ఆలూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని కేంద్రాలకు మొత్తం 76 యంత్రాలను సమకూర్చింది. వీటి ద్వారా బుకింగ్ చేసుకున్న రైతులకు వాటిని వారి ముంగిటకు చేర్చేవారు. పంటల సాగులో సాంకేతికంగా మెలుకువలు నేర్పించేందుకు కియోస్కలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. అయితే కూటమి ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో వినియోగానికి దూరమయ్యాయి.

-ఆలూరు రూరల్

ఉత్సవం ప్రారంభమైంది..



లింగనేనిదొడ్డి సమీపంలోని కొండపై వెలసిన మునిరంగస్వామి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నంద్యాల పక్కీరప్ప తాతయ్యస్వామి గురుకుల పీఠాధిపతి శ్రీనివాసులుస్వామి ఆధ్వర్యంలో తొలిరోజు మహాగణపతి పూజ, కాశీవిశ్వనాథస్వామికి రుద్రాభిషేకం, పార్వతీదేవికి అష్టోత్తర శతనామార్చన, మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అర్చకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు. - తుగ్గలి

విరబూసింది..



ఆలూరు పట్టణంలోని ఎన్జీఓస్ కాలనీలో నివాసం ఉండే వెంకటలక్ష్మి, నాగేంద్ర ఇంటి ఆవరణలో బ్రహ్మ కమలం విరబూసింది. ఏటా కార్తీక మాసంలో ఈ పుష్పం వికసిస్తుందని ఈ సారి 15 రోజులు ఆలస్యంగా వికసించిందని వారు తెలిపారు.

- ఆలూరు రూరల్

పన్నులు కట్టరేమి?

- ప్రభుత్వ శాఖల నుంచి అందాల్సిన బకాయిలు రూ.4.59 లక్షలు
- కుంటుపడుతున్న గ్రామ పంచాయతీ అభివృద్ధి
- ఏళ్లుగా బకాయి ఉన్నప్పటికీ.. స్పందించని అధికారులు



ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆలూరు రూరల్: ఆదర్శంగా ఉండాల్సిన అధికారులు.. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఏళ్లుగా పంచాయతీకి పన్ను బకాయి పడ్డారు. గ్రామ పంచాయతీకి ప్రభుత్వ కార్యాలయాల నుంచి చెల్లించాల్సిన ఆస్తి పన్ను, నీటి పన్ను ప్రభుత్వ శాఖలు చెల్లించకపోవడంతో ఆలూరు గ్రామ పంచాయతీ అభివృద్ధి కుంటుపడుతోంది. పటణంలో 28 ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో 20 శాఖల నుంచి రూ.4.59 లక్షలు పన్ను రూపంలో రావాల్సి ఉంది. ఏళ్ల తరబడి పన్ను చెల్లించకుండా ఆదాయాన్నిచ్చే శాఖలు సైతం గ్రామ పంచాయతీ పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి ఇప్పటి వరకు రూ.83,298, పంచాయతీరాజ్ శాఖ రూ.80,949, అగ్రికల్చర్ కార్యాలయం రూ.31,158, సీఎల్ఆర్సీ ఆఫీసు రూ. 59 వేలు, ఎంపీడీఓ కార్యాలయం రూ.23,219 తహసీల్దార్ కార్యాలయం రూ.19వేలు, పోలీసు స్టేషన్ రూ.79,471, కాస్మోపాలిటన్ క్లబ్ రూ.47,688, జూనియర్ సివిల్ కోర్టు క్వార్టర్స్ రూ.13,358, ఫైర్ ఆఫీసు రూ.10వేలు, ఆర్ అండ్ బీ అతిథి గృహం నుంచి రూ.11,252, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ రూ.8వేలు పంచాయతీకి పన్నుల రూపంలో చెల్లించాల్సి ఉంది. విద్యుత్ శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఆర్టీసీ బస్టాండు మాత్రమే ఎప్పటికప్పుడు పన్నులు చెల్లిస్తున్నాయి. మిగిలిన శాఖలు ఏళ్లుగా చెల్లించకపోవడంతో గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రతికూలంగా మారాయి. ప్రతి ఏడాది పంచాయతీ సిబ్బంది డిమాండ్‌లు అందించి,నోటీసులు జారీ చేస్తున్నా ఆయా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

నోటీసులు పంపుతాం



గ్రామ పంచాయతీకి పన్నులు చెల్లించకుండా బకాయిపడిన ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు జారీ చేస్తాం. ఇప్పటికే కొన్ని శాఖలకు నోటీలు అందించాం. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోపు పన్నులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రతి సంవత్సరం పంచాయతీకి పన్ను చెల్లిస్తే గ్రామ అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుంది. – ప్రభాకర్,ఈఓ,ఆలూరు

ర్యాలీకి తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



హొళగుంద నుంచి కర్నూలుకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

పత్తికొండ(తుగ్గలి) : కర్నూలు జిల్లా కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిర్వహించిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' ర్యాలీకి పత్తికొండ, తుగ్గలి మండలాల నుంచి ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలు, రైలులో కార్యకర్తలు, అభిమానులు, రైతులు తరలివెళ్లారు.

హొళగుంద: కర్నూలు కలెక్టరేట్ ఎదుట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమానికి హొళగుంద మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తరలి వెళ్లారు. ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి నేతృత్వంలో మండల కన్వీనర్ షఫీవుల్లా, నాయకులు ఎస్కే గిరి, కోగిలతోట శేషప్ప, దరగన్న, మంజునాయక్, సిద్దప్ప, పల్లి ఈరన్న, సిద్దప్ప తదితరులు వాహనాల్లో తరలి వెళ్లారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



పెండేకల్లులో అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

తుగ్గలి : భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సుధాకరరెడ్డి, తహసీల్దార్ రమాదేవి కోరారు. శుక్రవారం పెండేకల్లులో సర్పంచ్ నీలావతి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వివిధభూ సమస్యలపై రైతులు 10 అర్జీలు ఇచ్చారు.

ఆలూరు రూరల్: భూ వివాదాల పరిష్కారానికి గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గోవింద్ సింగ్ అన్నారు. శుక్రవారం మండలంలోని అరికెర గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వారసత్వంగా సక్రమించిన భూమి రిజిస్టర్ కార్యాలయంలో బంజరు భూమిగా నమోదై ఉన్నందున ఇతరులకు రిజిస్ట్రేషన్ కావడం లేదని కోరుతూ.. గ్రామానికి చెందిన జంబన్న వినతి పత్రం అందించాడు. అలాగే అడంగల్ మార్పులు,చేర్పులు, మిగులు భూమి, పాసుపుస్తకం కోసం 23 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వెల్లడించారు.

ఆస్పరి: భూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శివశంకర్ నాయక్ అన్నారు. మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదుస్సు నిర్వహించారు. బిల్లేకల్లు, అట్టెకల్లు, ఐనకల్లు రైతులు, బిల్లేకల్లులో శ్మశాన వాటికకు స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తహసీల్దార్‌ను కోరారు.

మద్దికెర : రైతులకు సంబంధించిన పాస్‌బుక్కులో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి, తహసీల్దార్ హుసేన్ సాహెబ్ పేర్కొన్నారు. శుక్రవారం మద్దికెర ఉత్తరం గ్రూపునకు సంబంధించిన రైతులకు రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

హాలహర్వి: భూ సమస్యలను పరిష్కారం చేసుకోవాలని తహసీల్దార్ నజ్మాబాను అన్నారు. శుక్రవారం మండలంలోని బేవినహాల్, శ్రీధర్‌హాల్, సాకిబండ గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

దేవనకొండ: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు మండలంలో తూతూ మంత్రంగా సాగుతున్నాయి. మండలంలో అత్యధికంగా భూ సమస్యలు ఉన్నాయి. ఏ రెవెన్యూ పరిధిలో రెవెన్యూ సదస్సు నిర్వహించినా సింగిల్ డిజిట్ దరఖాస్తులు కూడా రావడం లేదు. శుక్రవారం మండలంలోని కుంకనూరు పంచాయతీలో తహసీల్దార్ లోకేశ్వరరావు, వీఆర్వో హరికృష్ణ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కేవలం ఎనిమిది దరఖాస్తులు మాత్రమే వచ్చాయి.

కృష్ణగిరి: గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ కోరారు. లక్కసాగరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారి నాగరాజు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి):మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ పాల్గొన్నారు. రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు.

హొళగుంద: గ్రామంలో కొన్నేళ్ల క్రితం దళితులకు పంపిణీ చేసిన ల్యాండ్ సీలింగ్ భూముల్లో అక్రమాలు జరిగాయని విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు గుడుదప్ప, శేషగిరి, బాధిత రైతులు తహసీల్దారు సతీష్‌ను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు పలు భూ సమస్యలను తహసీల్దారు దృష్టికి తీసుకొచ్చారు. మొత్తం 10 భూ సమస్యలు, కుల, ఆదాయ తదితర ధ్రువ పత్రాలకు 27 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్‌పై విచారణ

పత్తికొండ(తుగ్గలి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్లస్టర్ పరిధిలో దాదాపు 14 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసేందుకు సిద్ధమయ్యారు. వీరిలో నలుగురిని ఇప్పటికే సస్పెండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు తమను అకారణంగా తొలగిస్తున్నారంటూ పలువురు బాధిత ఫీల్డ్ అసిస్టెంట్లు జిల్లా కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో డ్వామా అడిషనల్ పీడీ మాధవీలత విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఉప్పర్లపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ రాజునాయక్ ఏ తప్పు లేకపోయినా తనను అకారణంగా తొలగించాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

గ్రామంలో విచారణ సమయంలో ఏపీడీ తమ వాదనలు పట్టించుకోకుండా ఓ వర్గం చెప్పినట్లుగా రాసుకొచ్చారని అడిషనల్ పీడీకి చెప్పుకున్నారు. ఏపీడీ, ఫీల్డ్ అసిస్టెంట్ల వాదనలు విన్న అడిషనల్ పీడీ నివేదికను కలెక్టర్, పీడీలకు అందజేస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



వాహన దారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ దిలీప్ కుమార్

ఆలూరు రూరల్: వాహనాలు నడిపే వారు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ దిలీప్ కుమార్ అవగాహన కల్పించారు. శుక్రవారం కర్నూలు– బళ్లారి రహదారిలో వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అతివేగం ప్రమాదాలకు కారణం అన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని చెప్పారు. ట్రాలీ ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధించారు.

ఆడపిల్లలను రక్షిద్దాం



కరపత్రాలను విడుదల చేస్తున్న డాక్టర్ నాగప్రసాద్

మద్దికెర : సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని ఎలాంటి వివక్షత చూపరాదని, ఆడపిల్లలను పుట్టనిద్దాం, బతకనిద్దాం, రక్షించుకుందాం, చదవనిద్దామని వ్యాధినిరోధక టీకాల జిల్లాధికారి డాక్టర్ నాగప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆడపిల్లలను రక్షిద్దాం–చదివిద్దాం అనే కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల తల్లీ బిడ్డలకు అనారోగ్యం ఏర్పడుతుందని, మాతా శిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. లింగ నిష్పత్తిలో సమతుల్యత లేకపోవడంవల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం పాఠశాలల్లో జరిగే 4–డి స్క్రీనింగ్, క్యాన్సర్ స్క్రీనింగ్‌ను పరిశీలించారు. వైద్యులు డాక్టర్ రాగిణి, సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

విలేకరులపై దాడి హేయం



ఆలూరులో తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతి పత్రం అందిస్తున్న జర్నలిస్టులు



కృష్ణగిరిలో తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

ఆలూరు రూరల్: వార్త సేకరణకు వెళ్లిన సాక్షి విలేకరులపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడడం హేయమైన చర్య అని ఆలూరు మండల జర్నలిస్టులు ఖండించారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండల కేంద్రంలో సాగునీటి సంఘాల ఎన్నికల వార్త సేకరించడానికి వెళ్లిన సాక్షి దిన పత్రిక విలేకరి రాజారెడ్డి, సాక్షి టీవీ ప్రతినిధి శ్రీనివాసులు, కెమెరామెన్ రాముపై దాడి చేసిన టీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. రాజకీయ కక్షలతో విలేకరులపై దాడి చేసి, గాయపరచడం దుర్మార్గం అన్నారు. దాడి చేసిన వారిని తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు చంద్రబాబు, గోపాల్,రామ్మోహన్, భీమ,రామాంజనేయులు, కిరణ్, సాహెబ్ జాన్ ఉన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : వైఎస్సార్ కడప జిల్లా వేములలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య అని ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు సాల్‌రంగడు అన్నారు. నీటి సంఘం ఎన్నికలకు సంబంధించి కవరేజీ చేసేందుకు వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, రిపోర్టర్ రాజారెడ్డిపై జరిగిన దాడిని ఖండించారు. జర్నలిస్టులపై కొందరు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరచడం , కెమెరాలు ధ్వంసం చేయడం సరైందికాదన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆస్పరి: వేములలో వార్తల సేకరణకు వెళ్లిన సాక్షి టీవీ రిపోర్టర్ శ్రీనివాస్, కెమెరామెన్ రాము, సాక్షి పత్రికా విలేకరి రాజారెడ్డిపై కూటమి పార్టీ నాయకులు దాడి చేయడాన్ని మండల ఏపీడబ్ల్యూజే సంఘం నాయకులు తిమ్మన్న, నాగన్న, శ్రీనివాసులు ఖండించారు.

విలేకరులపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని పునరావృతం కాకుండా చూడాలని శుక్రవారం మండలంలోని బిల్లేకల్లులో తహసీల్దార్ శివశంకర్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. దాడిని సీపీఐ,సీపీఎం, సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ఏఐవైఎఫ్ నాయకులు ఖండించారు.

కృష్ణగిరి: పాత్రికేయులపై దాడి చేసిన కూటమి నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే యూనియన్ మండల అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు యూనియన్ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఘటనలు పునావృతం కాకుండా దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లక్ష్మీనారాయణ, నారాయణ, సంజీవరెడ్డి, కృష్ణ, బషీర్ ఉన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మీడియాపై దాడులకు పాల్పడితే సహించేది లేదని ఏపీయూడబ్ల్యూజే వెల్దుర్తి మండల యూనియన్ అధ్యక్షుడు షేక్ అమీర్ హెచ్చరించారు. వైఎస్సార్ కడప జిల్లాలో సాక్షి జర్నలిస్టులపై దాడులు చేసిన కూటమి నేలతపై కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం వారు యూనియన్ సభ్యులతో కలిసి తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. చంద్రశేఖర్, ఓమేంద్ర, రాజశేఖర్, అంజి, ఈశ్వరయ్య, అశోక్, దత్తు, శేఖర్ పాల్గొన్నారు.

హొళగుంద: వేములలో సాక్షి టీవీ కరెస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిపై దాడి చేసిన కూటమి నాయకులను కఠినంగా శిక్షించాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నాయకులు విరుపాక్షి, రవికాంత్, నాగప్ప, ముదస్సర్, మహేష్‌గౌడ్, తాహెర్‌బాషా తదితరులు లింగంపల్లి గ్రామంలోని రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ సతీష్‌కు వినతి పత్రం సమర్పించారు.

సుస్థిర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



తుగ్గలిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పత్తికొండ(తుగ్గలి) : సుస్థిర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని డీఎల్‌పీవో వీరభద్రప్ప అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యల సాధనపై నిర్వహిస్తున్న చివరి రోజు శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులపై అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజాప్రతి నిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సువర్ణలత, ఈవోపీఆర్డీ నరసింహులు పాల్గొన్నారు.

తుగ్గలిలో..

సుస్థిరాభివృద్ధిపై దృష్టి సారించాలని ఈవోపీఆర్డీ శ్రీహరి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్‌పై ప్రజా ప్రతినిధులు, అధికారులకు రెండు రోజులగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈవోపీఆర్డీ, ట్రైనర్లు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పించారు. కార్యాలయ ఏవో మహబూబ్‌బాషా, జూనియర్ అసిస్టెంట్ రాంబ్రహ్మం పాల్గొన్నారు.

దేవనకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామీణాభివృద్ధిపై పంచాయతీరాజ్ శాఖ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ గౌరీదేవి పాల్గొని మాట్లాడారు. పల్లెల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు మండలస్థాయి అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఈఓపీఆర్డీ సూర్యనారాయణ,పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: అధికారులు, సర్పంచ్‌ల సమష్టి కృషితోనే పంచాయతీల సుస్థిర అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సర్పంచ్‌లకు, అధికారులతో గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధిపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. పేదరిక నిర్మూలనలో భాగంగా మెరుగైన జీవనోపాధులను కల్పించడం, ప్రజల ఆరోగ్యం, సురక్షితమైన నీటిని అందించడం ఇందులో భాగమేనన్నారు ఈఓఆర్డీ చిన్న లచ్చప్ప, ఏపీఎం మహేశ్వరయ్య, ఏపీఓ నాగసులోచన పాల్గొన్నారు.

వెల్దుర్తి మండలంలో..

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెండవ రోజు ప్రజాప్రతినిధులకు, అధికారులకు గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుహాసినమ్మ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం తొమ్మిది అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు.

సీజనల్ హాస్టళ్లు ప్రారంభం



సీజనల్ హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ, ఎంఈఓ సత్యనారాయణ

హొళగుంద: తల్లిదండ్రులు వలస వెళ్లిన విద్యార్థులకు సీజనల్ హాస్టళ్లు వరంలాంటివని ఎస్ఐ బాల నరసింహులు, ఎంఈఓ–1 సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంబేడ్కర్, వరలక్ష్మి సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల ఆధ్వర్యంలో రెండు కాలానుగుణ వసతి గృహాలను ప్రారంభించారు. సర్వశిక్షా అభియాన్ కర్నూలు వారి సహకారంతో మండలానికి చెందిన ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో హాస్టల్‌ను ప్రారంభించారు. సంస్థ అధ్యక్షుడు చిన్నహ్యేట నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, వెలుగు ఏపీఎం సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కృష్ణగిరి: వలస వెళ్లిన తల్లిదండ్రుల పిల్లల కోసం ఏర్పాటు చేస్తున్న సీజనల్ హాస్టళ్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ–2 మద్దయ్య కోరారు. మండలంలోని కోయిలకొండ శుక్రవారం సీజనల్ హాస్టల్‌ను ప్రారంభించారు. గ్రామంలో ఇది వరకే ఒక హాస్టల్ ఉండగా ఇప్పుడు మరో హాస్టల్‌ను ప్రారంభించామన్నారు. విద్యార్థులకు ట్యూషన్‌తోపాటు వసతి ఏర్పాటు చేసి నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులు దామోదర్‌రెడ్డికి సూచించారు. హెచ్ఎం మైఖేల్, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు రామకృష్ణ, చంద్రశేఖర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.